
22.10.2000



పి.రామకృష్ణ



# పిచ్చికుంట్ల సుబ్బడు

***ఇదో... ఇట్టా ఎన్నెలకాసేతలికి నేను యాడన్నావుండనీ మనూరే గ్యాపకమొస్తాదబ్బీ, అదేందోమల్లా! నేను మనూరిడ్సి రోంత తక్కువ యాభైయేండ్లుకాలా? ఇన్నేండ్లనుంచీ ఎన్నో వూర్లు తిరిగితి, ఇప్పుడు ముసిలోన్నయిపోతి. పండ్లూడిపాయె, కండ్లు సరిగ్గా కనపడకపాయె, మోకాళ్ళ నొప్పులొచ్చె. అదేందో వీపీనా, బిపీనా... అదొచ్చె. ఇట్టా కొన్నిపాయె, కొన్ని వచ్చెననుకో. ఎన్నిపోయినా ఎన్నెలొచ్చేతలికి మనూరి గ్యాపకం మాత్రం పోలా! ఎన్నెలొస్తే మనూరు గ్యాపకమొస్తాదా, మనూరు గ్యాపకమొస్తే ఎన్నెలొస్తాదా అనేది నాకే తెలడంలా. అయిరెండూ ఎనకాముందనుకో. ఆ ఎంబడే పిచ్చికుంట్ల సుబ్బుడు! అదేందో సిత్రమబ్బీ... ఎన్నెల గ్యాపకమొస్తే సెంద్రుడు కనపడాలగదా, నాకు సుబ్బడే కనిపిస్తాడు!***

నీకు పిచ్చికుంట్ల సుబ్బుడు తెల్దుగదూ! నీకేందిలే, మీనాయినకే తెల్చునో, లేదో! అసలుకు వాళ్ళిప్పుడు కతలు జెప్పేందుకు మనూరికి వస్తాండారో, లేదో! వస్తాంటే, సుబ్బుడప్పటికే ముసిలోడు కనక ఆ మనిసిపోయినా, సిన సుబ్బుడూ, పిల్ల సుబ్బుడూ వస్తావుండాల. సరిగ్గా ఆయాంప్రెకారమూ సూస్తే, పిల్లసుబ్బుడిప్పుడు కతలు జెప్తాండాల. వాళ్ళిప్పుడు రాడంలేదంటాండావా... ఓహో! అవులే... కాలం మారిపాయె. ఇప్పుడు వాళ్ళుజెప్పే గోత్రాలెవరిక్కావాల? కతలెవరిక్కావాల? అయితే, పిల్ల సుబ్బుడిప్పుడు ఏంజేస్తావుండాడో! ఏదో రోంత సదువుకోనివుంటే, ఏ సిన్నాసితకా ఉద్యోగమో సేస్తావుండాలి, ల్యాకపోతే కూలిపనన్నా సేసుకుంటావుండాలి. ఉద్యోగమైనా కూలిపనేననుకో. సరే, ఏజ్జేసినా వాళ్ళ బ్బానాయనలు సేసిన పనిసెయ్యడంలేదు. అంతేగదా! వాడిప్పుడు ఇంట్లోనో, ఇంట్లో ఈల్లేకపోతే ఈదిలోనో టీవీలల్లో సిన్మాపాటలింటా, సిన్మాలు సూసుకుంటా వుండాల. పిచ్చికుంట్ల సుబ్బుని మనవడు టీవీల్లో పిచ్చి సిన్మాపాటలింటా, పిచ్చిసిన్మాలు సూసుకుంటావుంటే, ఎంత బాదగా వుంటాదో తెల్చునా అబ్బీ!

"ఏందబ్బా నువు జెప్పేది? పిచ్చికుంట్లోళ్ళ కతలు టీవీ పోగ్రాంలకంటే గొప్పయైనట్టు సెప్తావుండావే! పిచ్చికుంటోళ్ళంటే అడుక్కునే వాళ్ళేగదా! తరతరాలూ అడుక్కుంటావుండాల్నేనా నువు జెప్పేది?" అనుకుంటావుండావా అబ్బీ! వాళ్ళు అడుక్కొంటానే వుండాల్నని అనడంలేదబ్బీ! నువ్వనేది బాగానే వుంది, ఒప్పుకొంటాండా. అయితే, నేజెప్పేది యిను ఒప్పుకోవద్దులే. వూరికెయినును, సాలు.

పిచ్చికుంట్లోళ్ళు ఎల్లకాలమూ ఏగిలేసినాల్నించీ అడుక్కునే వాళ్ళు కాదబ్బీ. ఆమనికాలంలో మాత్రమే అడుక్కుంటారు. మిగిల్న కాలంలో మనాల్నే ఏదో పన్జేసుకుంటా బతికేటోళ్ళే. "ఏడాదికొక్కసారి అడుక్కున్నా అడుక్కునే వాళ్ళేగదా!" అంటావా! అట్టనేగానీలే. వాళ్ళు సరిగ్గా పంటకల్లాల్లోకి వచ్చేతలికి దిగేవాళ్ళు. కల్లాలయిపోతానే పొయ్యేవాళ్ళు. వచ్చేటప్పుడు వుత్తసేతుల్తో వచ్చినోళ్ళు, పొయ్యేటప్పుడు బాడిగ బండికి దాన్నెంమూటె లేసుకుని పొయ్యేవాళ్ళు! అందుకే వాళ్ళొచ్చినారనేతలికి "కొర్రలు దెంకపోడానికి వొచ్చినారేమో" అని రైతులు నగుతా అనేవాళ్ళు. అట్టన్నాగానీ వాళ్ళొచ్చినందుకు యీళ్ళకూ సంతోసంగానే వుండేది. ఆ మాట నగుతా అనేవాళ్ళంటే, కోపంతో అన్లేదనేగదా! వూళ్ళోకి దిగుతానే, పెద సుబ్బుడూ, సిన సుబ్బుడూ తలకాయలకు ఎర్ర రుమాళ్ళు సుట్టుకోని గంట వాయిచ్చుకుంటా, ఇంటింటికీ తిరిగి ఎవరెవరి గోత్రాలు వాళ్ళకు గుర్తుజేసే వాళ్ళు. గుర్తు సెయ్యడానికేముందిలే, అయేమన్నా మారేఇయా, ఏటా సెప్పడానికి! ఆవాలగోత్రమంటే ఎప్పుటికీ ఆవాల గోత్రమే, ఆరికెల గోత్రమంటే ఎప్పుటికీ ఆరికెల గోత్రమే. వాళ్ళు ఆవాలనూ, యీళ్ళు ఆరికెల్నూ తినగూడదంట. ఆకుటుంబాల్లోని పిల్లలూ, వాళ్ళ పిల్లలూ గూడా వాళ్ళవాళ్ళగోత్రాల్ను తినగూడదు. ఇప్పుడు గోత్రం పోయినా కులం వుందికానీ, ఒకప్పుడు గోత్రం కులమూ రెండూ వుండేవి. సరే, అదట్ట వుండనీలే.

నాగ్గ్యాపకమొచ్చే తలికే పెద సుబ్బుడు ముసిలి సుబ్బడైపోయి, సిన సుబ్బుడు గుడకా పెదసుబ్బుడు అయితా అయితా వుండాడు. పిచ్చికుంట్లోళ్ళ ఆడోళ్ళపేర్లు ఎట్టుండేయోకానీ, మొగోళ్ళ పేర్లలో 'సుబ్బుడు' ఎక్కువగా వుండేది. సుబ్బుని కొడుకు సిన సుబ్బుడు, సిన సుబ్బునికొడుకు పిల్ల సుబ్బుడు. ఆ పిల్ల సుబ్బుని కొడుకుపేరో అంటావా, అదిమల్లా ఎనక్కి తిరుక్కోని వుత్త 'సుబ్బుడు' కాడికొచ్చేదేమో! ఒకనికి ఒక్కడే కాకుండా ఇద్దరు ముగ్గురు పుడితేనో... అంటావా! అవు, అదీ వుంటాది. అప్పుడు, నడిపి సుబ్బుడు, సంటి సుబ్బుడు ఇట్లా వుంటాది. ల్యాకపోతే, ఎర్రగావుంటే ఎర్ర సుబ్బుడూ, నల్లగావుంటే నల్ల సుబ్బుడూ, పొట్టిగా వుంటే పొట్టి సుబ్బుడూ, లావుగా వుంటే దుబ్బ సుబ్బుడూ... ఇట్టా, ఎట్టా వుంటే అట్టా సుబ్బుడు! అద్సరే, దుబ్బ సుబ్బడంటే గ్యాపకమొస్తాంది. పెద సుబ్బుడు దుబ్బగానే వుండేవాడు. కూచ్చుంటే, సిన్నకొండ కూచ్చున్నెట్టేవుండేది. అప్పుడప్పుడే తూరుపు దిక్కునుంచీ ఎన్నెల మెలమెల్లగా సలసల్లగా పెన్నేటి మీద పడి నడ్సుకుంటావస్తావుంటాది వూరి దిక్కు. మొగోళ్ళు బువ్వల్దిని కల్లాల్లోకి పోడానికి పయనమైతావుంటారు. ఆడోళ్ళప్పటికి బువ్వలు పెడ్తావుంటారు. పిల్లోళ్ళు మాత్రం ఎప్పుడో తినేసి, పెద్దరుగు బయల్న ఆడుకొంటా వుంటారు. అప్పుడు, 'ఘుమ్...గుమ్... గుమిక్... గుమిక్' అని గుమ్మెత సెబ్దం యినిపిస్తాది. ఆడుకుంటాండే పిల్లోళ్ళు ఒక్కసారిగా బిలబిలమంటా పెడిసెల మాదిరి ఎగిరిపోయి, వాళ్ళ పక్కన వాల్తారు. "రోంతసేపు కతయిని పోదాంలే" అను కుంటారు, కల్లాల్లోకి పోయే మొగోళ్ళు. తొందరగా బువ్వల్దిని పోదామనుకుంటారు ఆడోళ్ళు. పెద్దరుగు బయల్న గుమ్మెత 'గమ్గుమ్' అంటావుంటే, అందరికీ లోపల 'గుమ్, గుమ్' అన్నెట్టే వుంటాది.

బయలుమజ్జన సంచి పట్టలు పర్సుకోని కూచ్చోని వుంటారు వాళ్ళు. పెద సుబ్బుడు ఆర్మోనిపెట్టె వత్తుతా,



1

బూరగపోస్తావుంటాడు. కత జెప్పేటప్పుడు బల్లోకొడతాడు. గుమ్మెత కొట్టేది సుబ్బని కోడలు, సిన సుబ్బని బార్య. సిన సుబ్బని బార్య పెదసుబ్బని మనవరాలే. కొంచెం నత్తిపాపం, అందుకే బల్లోకొట్టకుండా గుమ్మెత కొట్తాది. ఇంగ కతజెప్పేది సిన సుబ్బడు. సినసుబ్బడు కతగాడు కాకముందు పెద సుబ్బడు కత జెప్పేవాడంట. ఎట్టజెప్పే వాడో మనకు తెల్దు. అప్పుడు పెద సుబ్బని బార్య గుమ్మెత కొట్టేదంట. ఆమె సచ్చిపోయినాక, కోడలొచ్చింది. అప్పటికి ఎన్నెల బాగా వచ్చుంటాది. బయల్నా, మంచాలేసి వుంటాయి. ఆడోళ్ళు బువ్వల్దిని, వక్కాకూ నములుకుంటావచ్చుంటారు. మొగోళ్ళు బఈడీలు తాగుతా, అరుగుమీదా, మంచాలమీదా కూచ్చొనుంటారు. అప్పటికి పార్తనలు కానిచ్చి, కతజెప్పడానికి లేస్తాడు సిన సుబ్బడు. తలకాయకు తెల్లటి రుమాల సుట్టుకోని వుంటాఢు. నొసట్న పెద్ద కుంకం బొట్టుంటాది. పంచె సైకిల్ కట్టుకట్టి, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని వుంటాడు. కుడిసేత సేతెడు పొడుగుటేగా వుంటాది. దానికి పిడికాడ గజ్జెలుంటాయి. వూళ్ళో పెద్దలందరికీ పేరుపేరునా దండాలు పెట్టి, ఏకత సెప్పమంటారని సబాసదుల్ని అడుగుతాడు. బాలనాగమ్మ కత, పల్నాటి యుద్దం, కుంటి మల్లారెడ్డి కత, కాటంరాజు కత... ఇయన్నీవచ్చు. ఎక్కువగా ఆడోళ్ళు బాలనాగమ్మ కత జెప్పమంటే, మొగోళ్ళు పల్నాటి యుద్దం జెప్పమంటారు.

ఈ కతలన్నీ ఏటా యినేటియే. అయినాగానీ, ఎప్పటికప్పుడు కొత్తగా యిన్నెట్టుండేటియి. కతజెప్తా, సినసుబ్బడు టేగాకుండే గజ్జెలు వాంచుతా, సెయ్యి ముందుకూ ఎనక్కూ కదిలిస్తా, కాళ్ళకుండే గజ్జెలు గూడా 'గళ్‌గళ్'మనిపిస్తా, 'జక్కిక్కిజాం' ఆగినట్టు, సిన్నసిన్న అడుగులేస్తా... బలే తమాసాజేసేవాడు. తొడుక్కున్న ఒదులొాదులు సొక్కా గొడుగు మాదిరి ఇచ్చుకునేట్టుగా, ఎగిరి దూకేవాడు. ఇంగోసారి, గజ్జెలసప్పుడు రానీకుండా పిల్లదుగులేస్తా రౌండు తిరిగేవాడు. ఇయిగూడా సూసినయే అయినా ఇసుగొచ్చేది కాదు. పైగా, మల్లా ఎప్పుడు టేగాను జలిపిస్తాడా, ఎప్పుడు ఎగిరి దూకి సుట్టూ తిరుగుతాడా... అనిపిస్తా వుండేది.

నువింతకు ముందంటివి "పిచ్చికుంటోళ్ళు అడుక్కునేవాళ్ళేగదా!" అని. కత జెప్పేటప్పుడు వాళ్ళను జూస్తే, వాళ్ళు అడుక్కునే వాళ్ళనిగానీ, అడుక్కోడానికే కత జెప్తావుండారనిగానీ అనిపిచ్చనే అనిపిచ్చదు. నువుగానీ సూసివుంటే, మవుగూడా అట్టనుండవు. కత జెప్పిన తర్వాత, నువన్నట్టే వాళ్ళు అడుక్కునేవాళ్ళు. కత జెప్పేదాకా ఎందుకు, రాత్రి కత జెప్పినాక పగులు వాళ్ళనుసూస్తే... రాత్రి కత జెప్పింది యీళ్ళేనాని ఆచ్చెర్యపోతాం. మజ్జుగా, నిద్దరమొకలేసుకుని, బువ్వల్దినేప్పుడు కొట్లాడుకుంటా, తిట్టుకుంటా వుంటారు.

బువ్వల్దినేప్పుడు కొట్లాడుకుంటారంటే గ్యాపకమొచ్చింది, సెప్తాయిను. పెద సుబ్బనికి సియ్యాలకూరంటే శానా ఇష్టమంట. వాసనొస్తే సాలు రాచ్చసుడైపోతాడంట. ఒకసారి సినసుబ్బడు యాన్నించో యాటకూర తెచ్చినాడు. ఇంగజూడు... కుండకుండే ముందు పెట్టుకుని, ముద్ద సంగట్లోకి ముక్క మిగల్నీకుండా తిన్నాంట. ఆర్సుకుంటా, తిట్టుకుంటా వుంటే... ఏందోనని పోతి పెద్దమ్మదేలం కాడికి. వాళ్ళెప్పుడొచ్చినా అందులోనే దిగుతార్లే. పిల్ల సుబ్బని క్కూడా పిసరంత వున్నీకుండా తిన్నాడన్న అక్కసుతో మనవరాలే కొట్టిందో, కొడుకే కొట్టినాడో, కట్టెతో కొట్టిందో, రాయితో కొట్టిందోగానీ.. కుడికన్ను పైనుంచీ నెత్తర కార్తాంది. అప్పటికే కండ్లు సరిగ్గా కనపడవు. సియ్యాలకూర వండిన అటికెముందు పెట్టుకుని ఇంగా తుడ్సుకొని తుడ్సుకొని సెయినాక్కొంటా వుండాడు. దెబ్బ తగిల్నకాన్నుంచీ నెత్తరకారి సుక్కలు సుక్కలు అటికెలో పడ్తాంటే అబ్బో... సూసేదానికే బయంకరమంగా వుండాడు! "సీ!సీ! సియ్యాల కూర మీద బండబడ, సుబ్బడి మీద గుండుబడ" అనిపిచ్చింది. ఆరాత్రి కతజెప్పేటప్పుడు వాళ్ళను నేనే మల్లా సిత్రపోతి. అదబ్బో కతలు జెప్పే పిచ్చికుంట్ల సుబ్బనికత.

ఇప్పుడు జెప్పు... అట్టాంటోళ్ళను ఒక్క మాటతో "అడుక్కునేవాళ్ళు" అనొచ్చునా? అది నాయమేనా?" సిన్మాలకంటె, టీవీ పోగ్రాంలకంటే వాళ్ళకతలు గొప్పయా?" అని అడిగితివి. ఏం జెప్పేది! ఎన్నెలొచ్చిందంటే, ఇప్పటికీ నాకు పిచ్చికుంట్ల సుబ్బడు గ్యాపకమొస్తాంటే... అయిగొప్పయో కాదో, అంతకన్నా గొప్పయేదన్నా వుండేమో నువే ఆలోసించుమల్ల.

(పెన్నేటి కతల్లో స్మరించనందుకు ఇన్నాళ్ళకు... 'బెటర్ లేట్ దేన్ నెవర్' అనుకుంటూ.) ●

**అప్పుడప్పుడే తూరుపు దిక్కునుంచీ ఎన్నెల మెలమెల్లగా సలసల్లగా పెన్నేటి మీద పడి నడ్సుకుంటావస్తావుంటాది వూరిదిక్కు. మొగోళ్ళు బువ్వల్దిని కల్లాల్లోకి పోడానికి పయనమైతావుంటారు.**

## నందనా సేన్‌కు థాయ్ ప్రేక్షకుల ఆదరణ



**బాం**కాక్ నగరంలో ఇటీవల జరిగిన చిత్రోత్సవంలో నందనా సేన్ నటించిన 'సెడ్యూసింగ్ మారియా' చిత్రానికి మంచి ఆదరణ లభించింది. థాయ్‌లాండ్‌లోని చలనచిత్ర అభిమానులు ఆమె ప్రతిభా సంపత్తులకు ముగ్ధులయ్యారు. ఈ చిత్రోత్సవానికి నందన కూడా హాజరయింది. ఈ చిత్రంలో ఆమె పర్‌ఫార్మెన్స్‌ను చాలామంది మెచ్చుకున్నారు. గత జనవరిలో న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఈ సినిమాను ప్రదర్శించినప్పుడు చాలామంది దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇక్కడి చిత్ర విమర్శకులు భిన్నమైన రీతిలో స్పందించారు. కాని అంతర్జాతీయంగా నందనకు ప్రశంసలందుతూనే ఉన్నాయి. తాజాగా థాయ్‌లాండ్‌లోని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తున్నారు. నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ కూతురు అయిన నందనకి బాలీవుడ్‌లో మాత్రం ఇప్పట్లో అవకాశాలు వచ్చేట్టు లేదు. అయినా ఇక్కడ అవకాశాల కోసం ఆమె ఎదురుచూడట్లేదనుకోండి. నటనను సృజనాత్మక వ్యాపకంగా భావించే నందన ఎక్కడయినా రాణించగలదంటున్నారు ఆమె అభిమానులు.

## ఇక హీరోలెవరినీ ముద్దు పెట్టుకోను: రాణిముఖర్జీ

**ఆం**గ్ల చిత్రాల్లో తప్ప భారతీయ సినిమాల్లో ముద్దు పెట్టుకునే దృశ్యాలు అరుదు. అలాంటి దృశ్యాల్ని సాధారణమైన అంశాలుగా తీసుకునే పరిస్థితి లేదు. అందుకే 'హే రామ్' చిత్రంలో రాణి ముఖర్జీ కమల్‌హాసన్‌ను ముద్దు పెట్టుకోవడం పెద్ద సంచలనం రేపింది. ఇటీవల ఆ విషయాన్ని రాణిముఖర్జీ దగ్గర ప్రస్తావిస్తే ఇక ముందు ఎప్పుడూ తన హీరోలను ముద్దు పెట్టుకోబోనని చెప్పింది. ఆ సినిమాలో ముద్దు సీను ఇంత రచ్చకు దారి తీస్తుందని తను ఊహించలేదంటోంది. "స్క్రిప్టులో ఈ ముద్దు సీను భాగమని కమల్‌జీ చెప్పడం వల్ల నేను అలా ముద్దు పెట్టుకున్నాను. ఈ విషయాన్ని గురించి నానారకాలుగా ఎందుకు మాట్లాడుకుంటారో నాకు అర్థం కాలేదు. తెరపై ముద్దు పెట్టుకునే దృశ్యం యాంత్రికమైంది. హే రామ్ షూటింగ్ అప్పుడు ఈ ముద్దు సీను తీసేటప్పుడు మా చుట్టూ యాభై మంది ఉన్నారు. అందులో ఎలాంటి ఉద్వేగానికి తావు లేదు" అని రాణి ముఖర్జీ వివరించింది. అయితేనేం ఆ ముద్దు సీను నానా రభసకు దారితీసిందన్నది తెలిసిందే. అందుకే ఇకముందు సినిమాల్లో ఇలా ముద్దు పెట్టుకునేది లేదని రాణి తెగేసి చెబుతోంది.





2